క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



అమృతలూరు (కొల్లూరు): పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, అపరిశుభ్ర వాతావరణం నెలకొనకుండా చూడవల్సిన బాధ్యత ఉందని అమృతలూరు ఎంపీడీఓ మారుతి శేషమాంబ అన్నారు. శనివారం మండలంలోని యలవర్రులో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత విషయంలో పంచాయతీ యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా గ్రామంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నెహ్రు పాల్గొన్నారు.

భూపోషకాల పెంపుపై దృష్టి సారించాలి



అమృతలూరు (కొల్లూరు): భూమిని సారవంతం చేసే పోషక విలువలను పెంపొందించడంపై రైతాంగం దృష్టి సారించాలని ఏపీసీఎన్ఎఫ్ బాపట్ల డివిజన్ మాస్టర్ ట్రైనర్ గండి శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని ప్యాపర్రులో భూమిలో పోషక విలువలు పెంపొందించుకోవడానికి చేపట్టాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. 18 రకాల విత్తనాలతో పీఎండీఎస్ కిట్లను తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈ విత్తనాలను భూమిలో చల్లుకోవడం ద్వారా వ్యవసాయ క్షేత్రాలను సారవంతంగా మార్చుకొని, భూమికి ఉపయోగపడే సూక్ష్మజీవులను కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సులోచన, ఐసీఆర్‌పీఎస్ దుర్గాదేవి, రామాంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మా పాఠశాలల్లో మీ పిల్లలను చేర్చండి

గోవాడలో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం



అమృతలూరు (కొల్లూరు): ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేపట్టడం జరుగుతుందని గోవాడ శ్రీ పావులూరి వెంకయ్య చౌదరి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. శివశంకరరావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 23 వరకు నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు చేపట్టడంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు పొందే వెసులుబాటు ఉండటంతోపాటు, మెరుగైన విద్యాబోధన అందుబాటులో ఉంటుందన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

పడమటి అంజయ్యకు నివాళులు



భట్టిప్రోలు (వేమూరు): వైఎస్సార్ సీపీ నాయకుడు పడమటి అంజయ్య మృతి చెందడం పార్టీకి తీరని లోటని పార్టీ అధికారి ప్రతినిధి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూట అశోక్ బాబు అన్నారు. భట్టిప్రోలు మండలంలోని కోనేటిపురం గ్రామానికి చెందిన పడమటి అంజయ్య కొంత కాలం నుంచి గుండె సంబంధించిన సమస్యతో బాధ పడుతూ శుక్రవారం మృతి చెందాడు. వరికూటి అశోక్‌బాబు శని వారం వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. అంజయ్య కుటుంబానికి పార్టీ అండదండలు పూర్తిగా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి

కొల్లిపర: వేసవిలో నీరు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి తూములూరు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. శనివారం పోషణ్ పక్షోత్సవంలో భాగంగా తూములూరు సెక్టార్‌లోని చివలూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

ఎంపీడీఓ ఎస్. సుదీప



చుండూరులో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి ఈవేస్ట్ సెంటర్‌కు తరలించే కార్యక్రమంలో ఎంపీడీఓ, సిబ్బంది

చుండూరు (కొల్లూరు): ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ఎనలేని ముప్పు వాటిల్లుతుందని ఎంపీడీఓ ఎస్. సుదీప అన్నారు. శనివారం చుండూరులో స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే ముప్పుపై ప్రజలకు అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ఈ వేస్ట్ వల్ల భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో మండలంలోని గ్రామాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి మండల పరిషత్తు కార్యాలయంలోని ఈ వేస్ట్ సెంటర్‌కు తరలించడంపై పంచాయతీ యంత్రాంగం దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిపాలనా అధికారిణి డి. సుధారాణి, ఏఈ డి. మరియదాసు, ఈఓపీఆర్‌ఆర్‌డీ ఎస్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో భాగంగా మండల పరిషత్, కర్లపాలెం గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో వేరువేరుగా జరిగిన పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సులో ఎంపీడీవో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్లపాలెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ లలితకుమారితో కలసి ఎంపీడీవో శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు(యాప్రాన్) అందజేశారు. ముందుగా సచివాలయం సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు కలసి కర్లపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ప్లాస్టిక్ వాడకం నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ లలితకుమారి

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సుందరమ్మ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సర్దార్ గౌతులచ్చన్న ఆశయాలు కొనసాగించాలి

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య



లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న చల్లా రామయ్య

బాపట్ల: సర్దార్‌గౌతులచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా శని వారం స్థానిక చీలురోడ్డు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి సర్దార్ గౌతులచ్చన్న చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. లచ్చన్న స్ఫూర్తితో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఎక్కువ పదవులు ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో బీసీ సీనియర్ నాయకులు మోర్ల సముద్రాలు గౌడ్, తాత గుండాల అంకయ్య, శీలం శివ గంగ, ముక్కాల చందు, కత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించి, మజ్జిగ పోస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: పెట్రోల్ కోసం వచ్చే వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గం కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రీభార్గవి విద్యాసంస్థల అధినేత పేరాల వెంకట సురేష్ కర్లపాలెంలో బైపాస్ రోడ్డు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీషణ్ముఖ ఫ్యూయల్ స్టేషన్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సందర్శించి కష్టమర్ల కోసం పెట్రోల్ బంక్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పెట్రోల్ కోసం వచ్చిన కష్టమర్లకు, వైఎస్సార్ సీపీ నాయకులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, బాపట్ల నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు ఆట్ల నాగేశ్వరరెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అక్కల శ్రీనివాసరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కె జాకీర్ హుస్సేన్, సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, ఎంపీటీసీ ఎస్‌కె ఆసిఫ్ అలీ, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్, పెట్రోల్ బంక్ మేనేజింగ్ డైరెక్టర్ పేరాల వెంకట సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, తోట వెంకటరత్నం, దొంతిరెడ్డి, శివారెడ్డి, సలగల ధర్మేంద్ర, ఆట్ల హరిబాబురెడ్డి, ఎస్‌కె షంషేర్, గరిగంటి కిరణ్, బడుగు ప్రకాష్, మనోహర్, పందరబోయిన శ్రీనివాసరావు, రావి అంజిరెడ్డి, దేవరకొండ రమేష్ తదితరులు ఉన్నారు.

చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు కారకాలు

అగ్నిమాపకశాఖ అధికారి సాంబశివరావు



మంటలను అదుపు చేసే ప్రక్రియను వివరిస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: చిన్న చిన్న నిర్లక్ష్యాలతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకునేందుకు అవకాశం ఉందని అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని వైష్ణవి నర్సింగ్ హోంలో శనివారం వైద్యశాల సిబ్బంది, రోగులు, ప్రజలకు అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంట్లో వంట చేసే సమయంలోగాని, విద్యుత్‌ను వినియోగించే సమయంలోగాని ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలకు తావిచ్చినట్లేనన్నారు. వంట గది, దుకాణాలు, వైద్యశాలలు, విద్యాసంస్థలు, సినిమా హాల్స్, కల్యాణ మండపంలు, ఆఫీసులు, పెట్రోలు బంకులలో అప్రమత్తత అవసరమని, ప్రమాదం వాటిల్లితే మంటలను అదుపు చేసే పరికరాలు ముందస్తుగా అందుబాటులో ఉంచటంతో పాటు ఆ పరికరాలు వినియోగించే విధానంపై పట్టు ఉండాలని సూచించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో వరిగడ్డి, వరికుప్పలు అగ్నిప్రమాదాలకు గురై దగ్ధమౌతున్నాయని, వీటిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు వాటిల్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో ఘనంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ



బాపట్ల: ఈస్టర్ పండుగ సందర్భంగా క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం బాపట్లలో నిర్వహించారు. బాపట్ల లో ఉన్న అన్ని సంఘాల పాస్టర్లు, ఎఫ్.డబ్ల్యు కోల్ ఆధ్వర్యంలో ఆరాధన టీం వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రన్ ఫర్ జీసస్ చేపట్టారు. ఈ కార్యక్రమన్ని ఎఫ్.డబ్ల్యు కోల్, మేజర్ వి యేసుపాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డబ్ల్యు కోల్ మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం ఈలోకంలో జన్మించారని, అందరిని సమానంగా చూడాలని, ప్రేమ, కరుణ భావాలతో మెలగాలని, సేవతో ఉండాలని చెప్పిన కరుణమయుడన్నారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పాల్గొన్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. సూర్యలంక ఇండెన్ గ్యాస్ గూడెం వద్ద నుంచి ప్రారంభమై విజయలక్ష్మిపురం మీదుగా కొత్తపేట,దగ్గుమల్లి వారిపాలెం, విలియమ్ బూత్, అంబేద్కర్ సర్కిల్, గడియార స్తంభం సెంటర్, పాత బస్టాండ్, చీల్ రోడ్డు సెంటర్, టీచర్స్ కాలనీ వరకు చేరుకుని తిరిగి సి.బి.జడ్ చర్చ్ వద్ద ముగించారు. ఈ కార్యక్రమం లో కాగిత వరప్రసాద్, గేరా బెనర్జీ మినస్, గేరా మణి భూషణ్ జాన్, చెల్లి అశోక్, బాపట్ల జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జంగం ప్రవీణ్, జోగి నోవహు, గుడపాటి జాన్ వెస్లీ, పవిత్ర కుమార్,గుమ్మడి ఆనంద్ బాబు, బెన్నీ టీమ్ షాలేం రాజు, చేతన్, మిల్కీ, దయాకర్ పాల్గొన్నారు.

25న ఆలయ వార్షికోత్సవం

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని రజక పార్కు వద్ద ఉన్న శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈనెల 25వ తేదీ నిర్వహించనున్నారు. ఉదయం బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకంతో కార్యక్రమాలను ఆరంభిస్తారు. గణపతి హోమం, నవగ్రహ హోమం, మహామృత్యుంజయ హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీకామాక్షమ్మ అమ్మవారికి లక్ష మల్లెపూలతో(శ్రీలలితా సహస్ర నామాలతో) విశేషపూజలు చేస్తారు. వేదపండితుడు తంగెళ్ల మారుతి వెంకట ప్రసాద్, ప్రతాపగిరి ప్రదీక్‌కుమార శాస్త్రి పర్యవేక్షణలో ఈ వేడుకలు జరుగుతాయి. పూజానంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.సుభాషిణి



కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిన ఉద్యోగులు



సమాచార పౌరసంబంధాలశాఖలో స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిన ఏడీ సుభాషిణి

బాపట్ల: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.సుభాషిణి అన్నారు. స్థానిక జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యం పదిలమని చెప్పారు. కాలుష్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ప్రజలలో బాధ్యతను పెంచడానికి స్వచ్ఛత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో చేపడుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ పద్మావతి, ఇందిర, శివ, అంజమ్మ, సుబ్బారావు, దేవకుమారి పాల్గొన్నారు.

వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వైద్యశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. జిల్లా వైద్యశాలను ఆమె శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో తనిఖీ చేశారు. మెడికల్ పరంగా వచ్చే వ్యర్థాలను రీసైక్లింగ్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. స్వచ్ఛాంధ్రా కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, జిల్లా వైద్యాధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దాం

భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని కలెక్టరేట్ ఏవో సీతారత్నం తెలిపారు. కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని ఉద్యోగులు పాల్గొని వ్యర్థాలను తొలగించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు షేక్ షఫీ, సతీష్, సంధ్యశ్రీ, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల ఉద్యోగులంతా పాల్గొన్నారు.



వైద్యశాలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ

స్వచ్ఛ రేపల్లెలో భాగస్వాములు కావాలి



తాలూకాను శుభ్రపరుస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో రామలక్ష్మీ, అధికారులు

ఆర్డీవో నేలపు రామలక్ష్మి పిలుపు

రేపల్లె రూరల్: స్వచ్ఛ రేపల్లె సాధనలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, ప్రజలు భాగస్వాములు కావాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తాలూకాలో శనివారం నిర్వహించిన ఈ-వేస్టు మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు కాలుష్యకారిణి పాల్‌థిన్ నివారణకు కృషి చేయాలన్నారు. పాల్‌థిన్‌ను స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ నిషేధించి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని కోరారు. అదేవిధంగా వాతావరణంలో కర్బన ఉద్గారాలు రోజురోజుకు పెరిగి వేడిమి పెరుగుతోందని, ఫలితంగా అనేక సమస్యలు ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. మొక్కల పెంపకంతో వాతావరణ సమతౌల్యం ఏర్పడటంతో పాటు వాతావరణ కాలుష్యం నివారించబడుతుందని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా పెంచడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలు, దుకాణాల్లో పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను పురపాలక సంఘంకు అందించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తాలూకా సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పూనుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తాలూకా ప్రాంగణంలో మొక్కలు నాటి గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కాకర్ల సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ మోటారు చోరీ



విద్యుత్ మోటారు చోరీపై వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్‌ఐ

కొల్లూరు: ప్రభుత్వ కార్యాలయాలకు సైతం రక్షణ కరవవడంతో చోరీలు చోటు చేసుకుంటున్నాయి. కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ మోటరు చోరీకి గురైన సంఘటన శనివారం ఉదయం కార్యాలయ సిబ్బంది గుర్తించారు. కార్యాలయంలో నీటి అవసరాలు కోసం తాగునీటి పంపుకు అమర్చిన విద్యుత్ మోటరును దుండగులు శుక్రవారం అర్ధరాత్రి దాటిన అనంతరం చోరీకి గురైనట్లు సిబ్బంది పేర్కొన్నారు. గతంలో రెవెన్యూ కార్యాలయాన్ని అనుకొని ఉన్న వెలుగు కార్యాలయం వద్ద ఉన్న విద్యుత్ మోటరు సైతం చోరీకి గురవడం, ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ మోటరు చోరీ జరగడంతో ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కరవవడం ప్రజలలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కొల్లూరు బస్టాండ్ సెంటర్ సమీపంలోని మీసేవా కేంద్రంలో సైతం ఇన్‌వర్టర్లు, బ్యాటరీలు చోరీలకు గురవడంతో తరచూ చోటు చేసుకుంటున్న చోరీలపై ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతుంది. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేసి చోరీలను అరికట్టాలని ప్రజలు కోరతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ మోటరు చోరీపై కొల్లూరు వీఆర్‌ఓ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్‌ఐ కోటయ్య సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాప్టిస్ట్‌పాలెంలో డాక్టర్ ఈవూరు పల్లెపడక

గ్రామస్తుల నుంచి సమస్యల ఆరా



బాపిస్టుపాలెంలో నిద్రిస్తున్న రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: కుటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ వినూత్నంగా తలపెట్టిన పల్లె పడక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెం పంచాయతీ బాప్టిస్ట్ పాలెంలో ప్రజలతో కలిసి నిద్రించారు. తొలిత గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన బస ప్రాంతంలో నిద్రించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామాల్లో డ్రెయిన్లు లేక మురుగునీరు రహదారులపై పారుతూ పారిశుద్ధ్యం క్షీణించి దోమలు విలయతాండం చేస్తున్నాయన్నారు. కనీస అవసరాలు కల్పించడంలో ప్రస్తుత పాలకులు శ్రద్ధ చూపడం లేదన్నారు. దోచుకో దాచుకో అన్న పద్ధతిలో మట్టిని ఇసుకను త్రవ్వుకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విద్యా, వైద్య రంగాలు నిర్వీర్యం అయిపోతున్నాయన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ విద్యా వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పించి పేద వారికి బాసటగా నిలిచారని గుర్తు చేశారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



సబ్‌జైలులోని ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్‌జైలులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రిమాండ్ ఖైదీలకు చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రిమాండ్ ఖైదీలు తమ కేసులను వాదించేందుకు ప్రైవేటు న్యాయవాదులను ఆశ్రయించే స్థోమత లేనివారికి ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన న్యాయవాది ద్వారా న్యాయ సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలతో బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోరాదని, ఇక నుంచైనా సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించాలని సూచించారు. సబ్‌జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూప శ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతా భార్గవి, సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన



క్రీడ సామగ్రితో విద్యార్థులు

కొల్లిపర: ప్రభుత్వ పాఠశాలలో బలమైన విద్యా పునాదులు పడడమే కాకుండా నాణ్యమైన బోధన లభిస్తోందని మున్నంగి క్లస్టర్ హెచ్ఎం అప్పారావు అన్నారు. శనివారం మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(రెగ్యులర్) లో ప్రధానోపాధ్యాయుడు రాము అధ్యక్షతన ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యసన స్థాయి మెరుగుపడాలంటే తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

• ఆర్థిక సాయం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరుకు చెందిన మెగా స్టార్ చిరంజీవి అభిమాని గోపిశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. మృతుని కుటుంబానికి పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ సభ్యులు శనివారం రూ.10 వేలు మృతుని స్నేహితుడు హరికృష్ణ ఆర్థిక సాయం అందించినట్లు చక్రవర్తి తెలిపారు.